క్లుప్తంగా

ఘనంగా గులామ్ అలీషా దర్గా ఉరుసు

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు బస్టాండువద్ద నున్న సయ్యద్‌షా గులామ్ అలీషా దర్గా ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు పురస్కరించుకుని దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. హిందూ,ముస్లిం సోదరులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

పీటీఎంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య తెలిపారు. ఈ నెల 18న ఆలయంలో అంకురార్పణ, కలశ స్థాపన, ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, శనైశ్వరునికి తైలాభిషేకం, మహా మంగళ హారతి, శివుని విగ్రహానికి పాలాభిషేకం, 19న ఏకవార రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్ర హోమం, శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 20న రథోత్సవం కార్యక్రమాలు కనుల పండువగా సాగుతాయన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్యకొండపై శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి నూతన రథంలో నంది వాహనంపై మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు పరిసర ప్రాంతాల్లోని పల్లెల్లో మెరువన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. 18న సాయంత్రం మౌనిక, హర్షిత నాయుడుచే భరత నాట్యం, కూచిపూడి నాట్యం అదే రోజు కల్యాణోత్సవం, రథత్సవం జరుగుతుందన్నారు. చాందినీ బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. 19న భారీ కర్పూర హారతి, అదే రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19వ తేదీలలో పీలేరు నుంచి తలకోనకు 20 బస్సులు, భాకరాపేట నుంచి తలకోనకు 4, బోడేవాండ్లపల్లె – తలకోన 3, బసన్నగారి పల్లె – తలకోన 3 చొప్పున బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే 19న కలకడ ఝరి ఉత్సవానికి పీలేరు – కలకడ మధ్య 10 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు, భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుకు రేపే చివరి గడువు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ రాయితీ ట్రాక్టర్ల దరఖాస్తుకు గడువు ఈ నెల 16కు ముగుస్తుందని ఏఓ ప్రేమలత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని పట్టెంవాండ్లపల్లి-వన్, తుమ్మరకుంట టూ, టి.సదుం, అంకిరెడ్డిపల్లి, సంపతికోట గ్రామాల్లో ట్రాక్టర్ అవసరమై గ్రూపులుగా ఏర్పడిన సభ్యులు ఇంత వరకు ఎలాంటి వివరాలు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమర్పించలేదన్నారు. సదరు గ్రూపు సభ్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

13 మంది జూదరుల అరెస్టు

కలికిరి: పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మొర్రంకిందపల్లి గ్రామం నాయనిచెరువుపల్లికి సమీపంలో చెరువు వద్ద పేకాట జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు వాల్మీకిపురం సీఐ బిఎన్ సురేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కలికిరి, పీలేరు మండలాలకు చెందిన 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,110 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడులలో ఏఎస్‌ఐలు మధుసూదనాచారి, మాబు సాహెబ్, హెచ్‌సీలు రాజేంద్ర, మనోహర్, పీసీలు, హోంగార్డులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

ములకలచెరువు : అక్రమంగా సారా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక మంగళవారం తెలిపారు. సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో వేర్వే దాడుల్లో యం.రమాదేవి, పుల్లయ్యలను అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ములకలచెరువు మండలం చౌడసముద్రంకు చెందిన నారాయణమ్మ కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి 25 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ చెప్పారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు సర్కిల్ పరిధిలోని కోటకొండ ఎగువ తండా పరిసర ప్రాంతంలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని సీఐ తెలిపారు. 400 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

భక్తుల వర ప్రదాత మద్దుండాల మల్లేశ్వరుడు

- ప్రకృతి సోయగాల మధ్య సెలయేటి ఒడ్డున కొలువైన స్వామివారు
- ఝరిస్నానాలు ఆచరిస్తే శుభం కల్గుతుందని ప్రగాఢ విశ్వాసం
- మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన మల్లేశ్వరస్వామి ఆలయం


మద్దుండాల మల్లేశ్వరస్వామి


మల్లేశ్వరస్వామి ఆలయం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీ అడవిపల్లె సమీపంలో వెలసిన శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి భక్తుల వరప్రదాతగా ప్రసిద్ధి చెందారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రకృతి సోయగాల మధ్య గలగల పారే సెలయేటి ఒడ్డు శ్రీ మద్దుండాల మల్లేశ్వరస్వామి స్వామి వెలిశారు. అడవిపల్లె సమీపంలో అటవీ ప్రాంతం మధ్యలో లోయ ప్రాంతం ఒడ్డున మల్లేశ్వరస్వామి కొలువై మహాశివ రాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. ప్రతి యేటా ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఝరిస్నానాలకు ఆచరిస్తే ఆ కుటుంబానికి శుభం కలుగుతుందని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం. సుమారు 300 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని విజయనగర సామంతులు ఇక్కడి పాలేగాళ్ల సహకారంతో నిర్మించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం గురించి, ఆ పేరు రావడానికి గల కారణాలు భక్తులు కథలుగా చెబుతారు. స్థానికుల కథనం మేరకు ''గంగాదేవి ఓ శుభకార్యానికి వెళ్లడానికి పార్వతీదేవి నుంచి ఆభరణాలు అరవుకు తీసుకుంటుంది. ఆ ఆభరణాలు తిరిగి పార్వతీ దేవికి ఇవ్వడానికి ఆలస్య అవుతుంది. దీంతో పార్వతీ దేవి కోపోద్రిక్తురాలై గంగాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మందలిస్తుంది. గంగాదేవి తీవ్ర అవమానానికి గురై మహోగ్ర రూపాన్ని దాల్చుతుంది. మల్లేశ్వర స్వామి ఆలయాన్ని ముంచెత్తే విధంగా గంగాదేవి ప్రవహిస్తుంది. గ్రహించిన మహాశివుడు గంగాదేవిని శాంతించే ప్రయత్నం చేస్తాడు. అయినా శాంతించకపోవడంతో నీటి ప్రవహాన్ని పక్కకు మళ్లిస్తాడు. దీంతో ఈ ప్రాంతంలో గుండం ఏర్పడుతుంది.' అప్పటి నుంచి ఈ ప్రాంతంలో వెలసిన మల్లేశ్వరస్వామి మద్దుండాల మల్లేశ్వరస్వామిగా భక్తులచే కొలువబడుచున్నాడు. ఈ గుండంలో ఝరిస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

అడవిపల్లె సమీపంలో మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీటీసీ వెంకటరమణనాయునివారు మాట్లాడుతూ ఈ నెల 18 ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు, రాత్రి జాగారం, అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే రాత్రి హరికథా కాలక్షేపం ఉంటుందని చెప్పారు. 19వ తేదీ ఝరి స్నానాలు, సిద్ధపూజ, మొక్కుబడులు, వరపడుట, నాణెలు, దేవరెద్దులు, భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి వెంకటేశ్వరనాట్య కళామండలిచే ద్రౌపది మాన సంరక్షణ వీధి నాటకం ఉంటుందని చెప్పారు. రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఫుడ్‌బ్యాంకు సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన ఫుడ్‌బ్యాంకు సేవలు ప్రశంసనీయమని ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌బ్యాంకు మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెల్పింగ్‌మైండ్స్ ద్వారా పలువురికి ఆహారం అందించడం గొప్ప విషయమన్నారు. పుట్టినరోజు, వివాహ వేడుకల్లో ఇతర కార్యక్రమాల్లో దాతలు ముందుకు వచ్చి ఫుడ్‌బ్యాంకులో ఆహార ప్యాకెట్లు పెడితే ఆకలి ఉన్నవారు తీసుకునేలా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్ధిక్, సభ్యులు పవన్, కిరణ్ పాల్గొన్నారు.

వాహనాల బహిరంగ వేలం

మదనపల్లె : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కారు, టాటాఏస్, ఆటో, ఐదు ద్విచక్రవాహనాలను తాలూకా పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం తాలూకా పోలీస్‌స్టేషన్ నుంచి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె సబ్‌డివిజన్ పోలీస్ అధికారి ఆధ్వర్యంలో మహీంద్రా వెరిటో కారు, టాటా ఏస్ లైట్ గూడ్స్ వెహికల్, ఆటోరిక్షా, ఐదు ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొని వాహనాలు కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

'మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే అర్హత పట్టాభికి లేదు'


మాట్లాడుతున్న నల్లారి శ్రీకర్ రెడ్డి

కలికిరి : టీడీపీ నేత పట్టాభికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే అర్హత లేదని సింగిల్ విండో చైర్మెన్ నల్లారి శ్రీకర్ రెడ్డి అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి, ప్రభుత్వంపై టీడీపీ నాయకుడు పట్టాభి అసత్య, అనుచిత ఆరోపణలు చేసిన నేపథ్యంలో స్పందించిన సింగిల్ విండో చైర్మెన్ మీడియాతో మాట్లాడారు. కార్యాలయాల్లో కూర్చొని లెక్కలు చెప్పడం కాదు.. క్షేత్ర స్థాయిలో ప్రజలలోకి వస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. టీడీపీ హయాంలోనే డిస్కంలు 20 వేల కోట్లు అప్పులు ఉండగా, వడ్డీలు కలిపి నేడు గుదిబండగా మారాయన్నారు. డిస్కంలను అప్పుల్లోకి నెట్టేసిన ఘనత మాజీ సీఎం చంద్రబాబుదేనని దుయ్యాబట్టారు. అటువంటి టీడీపీ నేతలు ఇప్పుడు మచ్చలేని నేత మంత్రి పెద్దిరెడ్డిపై అనవసర ఆరోపణలు చేయడం గురివింద నీతులు చెప్పడమేనన్నారు. టీడీపీ నేతలు మరోసారి మంత్రి పెద్దిరెడ్డిపై మరోసారి అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రపతి అవార్డుకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

వాల్మీకిపురం : రాష్ట్రపతి చేతులమీదుగా ప్రతి సంవత్సరం అందించే గోల్డెన్ యారో అవార్డుకు మండలంలోని ప్యారంపల్లికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శ్రీనివాసులు, అభిషేక్ ఎంపికై నట్లు హెచ్‌ఎం బాలాజీ తెలిపారు. జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపిక కాగా, ఇద్దరు విద్యార్థులు వాల్మీకిపురం మండలం నుంచి ఎంపిక కావడం విశేషం. ఈ విద్యార్థులు స్కౌట్స్‌లో శిక్షణ పొంది, ప్రత్యేక ప్రతిభను కనబరిచి రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 23 వరకు హర్యానాలో జరిగే గోల్డెన్ యారో అవార్డు ఉత్సవాల్లో పాల్గొని, అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన విద్యార్థులను గ్రామస్థులతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

కస్తూర్బా బాలికా విద్యాలయం తనిఖీ


పాఠశాల వసతులపై ఆరాతీస్తున్న స్పెషలాఫీసర్ జయరాజ్

పెద్దతిప్పసముద్రం : స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని మంగళవారం జిల్లా సర్వే ల్యాండ్ అధికారి, స్పెషలాఫీసర్ జయరాజ్ అస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేరకు పాఠశాలలోని రికార్డుల నిర్వహణ, భోజనం నాణ్యత, హాస్టల్ గదులు, తాగునీటి సౌకర్యం, విద్యా బోధన, కనీస సౌకర్యాల క్షుణంగా ఆరా తీసారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఇబ్బందులపై బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ నారాయణ, డాక్టర్ యస్దాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

మామిడిపూత రాలకుండా చర్యలు తీసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి

పీలేరు రూరల్: ప్రస్తుతం మామిడి పూత దశలో ఉన్నందున, పూత రాలకుండా రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బాలంవారిపల్లెలో బి.డి. నారాయణరెడ్డి మామిడి తోపులో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దశలో ఎక్కువగా తేనెమంచుపురుగు, పక్షికన్ను తెగులు పంటను ఆశిస్తుందని తెలిపారు. తెగులు నివారణకు థియోమెథోక్సిమ్ 0.3 గ్రాములు, తయోఫినెట్ మిథైల్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమాదేవి, ఆర్‌బీకే సిబ్బంది జహీర్, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలి

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా, పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మార్చి 21 వరకు అమలులో ఉంటుందన్నారు. అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆర్డీఓ ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు అధికారులుగా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు వ్యవహరించాలన్నారు. ఎంసీసీ అమలుపై అధికారులు, పోలీస్ యంత్రాంగం రోజువారి నివేదికలను అందించాల్సి ఉంటుందన్నారు. సాధారణ ఎన్నికలకు ఎలాంటి నిబంధనలు వర్తిస్తాయో ఎమ్మెల్సీ ఎన్నికలకు అవే అమలవుతాయన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న ఫ్లెక్సీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయనాయకుల ఫోటోలు, ఇతరాలను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమర్పించాల్సిన క్లెయిమ్ ఫారం-18, 19లను తహసీల్దార్‌లు వెంటనే క్లియర్ చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని డీఎల్‌పీఓ, తహసీల్దార్లు, ఎంపీడీఓ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఎరువులు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీ శివశంకర్

కలకడ : అనుమతులు లేకుండా ఎరువులు విక్రయించినా, తూకాలలో మోసం, బిల్లులు లేకుండా సరఫరా చేసిన దుకాణ దారులపై కేసులు తప్పవని మదనపల్లె వ్యవసాయశాఖ సహాయకులు శివశంకర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీలలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు అందించే ప్రతి ఎరువుకు విధిగా రసీదు ఇవ్వాలని, అలాగే ఎరువుల దుకాణం ఏర్పాటుకు లైసెన్స్, బిల్‌బుక్, అనుమతిపొందిన మందులు, ఎరువులు మాత్రం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి గౌరి, ఏఈఓ శ్రావన్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యం

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


తవళం నేలమల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని శివాలయాల్లో సామాన్య భక్తులకు ప్రథమ ప్రాధాన్యత కల్పించి, స్వామివారి దర్శనభాగ్యాన్ని కనులారా వీక్షించి సంతోషంగా ఇళ్లకు వెళ్లేలా ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో శివరాత్రి ఉత్సవం, జాతరల సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన వసతులు, చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎం.ఎస్.మురళి మాట్లాడుతూ.. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో తంబళ్లపల్లె మల్లికార్జున స్వామి దేవస్థానం, చిప్పిలి యోగభోగేశ్వరస్వామి దేవస్థానం, తవళం నేలమల్లేశ్వరస్వామి దేవస్థానం, కదిరినాథునికోట కనుగొండరాయునిస్వామి దేవస్థానం, మదనపల్లె సోమేశ్వరస్వామి దేవాలయం, కలికిరి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు ప్రముఖ శైవక్షేత్రాలుగా గుర్తింపు పొందాయన్నారు. వీటిలో శివరాత్రి సందర్భంగా విశేష సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయాలు దాదాపుగా సగానికిపైగా కొండలమీదే ఉన్నందున ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఆలయ దర్శన వేళలను ముందుగానే భక్తులకు తెలియపరచాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బ్యారికేడ్లు, నీటివసతి, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, ఎండకు చలువపందిళ్లు, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయాల్లో రద్దీ, క్యూలైన్లలో జాప్యాన్ని నివారించేందుకు పోలీసులతో పాటుగా ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు. శివరాత్రికి మూడురోజుల ముందుగా స్థానికంగా ఉన్న రెవెన్యూ, మండల అధికారులు ఆలయ ధర్మకర్తల మండలి, ట్రస్టీ, పాలకవర్గ సభ్యులతో సమావేశమై చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి, తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కొండపైకి బస్సులను అనుమతించే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ఏడాది ఉత్సవాల్లో ఏదైనా లోటుపాట్లు జరిగి ఉంటే ఈ ఏడాది పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రసాద వితరణ కేంద్రాల వద్ద తోపులాటలు, గొడవలు జరగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతరల్లో ఏర్పాటుచేసే దుకాణాలు, తినుబండారాల స్టాల్స్, వాహనాల పార్కింగ్ నిర్ణీత ప్రదేశాల్లోనే ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ జయకుమారి, ఎండోమెంట్ ఏసీ విశ్వనాథ్, ఈఓ మంజుల, తహసీల్దార్లు సీకే.శ్రీనివాసులు, మంజుల, నిర్మల, భాగ్యలక్ష్మి, ధనంజయ, భీమేశ్వరరావు, ఎంపీడీఓలు లీలామాధవి, గంగయ్య, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, ఎస్‌ఐ హరిహరప్రసాద్, ఆర్టీసీ డిపోమేనేజర్లు నిరంజన్, వెంకటరమణారెడ్డి, మల్లయ్యకొండ చైర్మన్ కే.ఆర్.మల్‌రెడ్డి, నిమ్మనపల్లె రమణారెడ్డి, విశ్వేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

మదనపల్లె : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన ఆవులరాజా, ఆర్టీఓ కార్యాలయానికి సమీపంలో నివసిస్తున్న భీమయ్య బైపాస్‌రోడ్డులో సోమవారం సాయంత్రం గంజాయి విక్రయిస్తుండగా దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ సుధాకర్, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు ఉమ్మడిగా దాడి నిర్వహించినట్లు చెప్పారు. నిందితులు ఒకొక్కరి వద్ద నుంచి 400 గ్రాముల చొప్పున సుమారు రూ.8,000 విలువ కలిగిన మొత్తం 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మదనపల్లె సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమామని జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరావతి అన్నారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో పుల్వామా అమరవీరులకు అంకితభావతంతో హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. మొదట పుల్వామా సంఘటనలో ప్రాణాలు అర్పించిన వీరులకు నివాళి అలర్పించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు సాబాన, పవన్, సునిల్, రమేష్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

అమరులకు ఘన నివాళి

కలికిరి: దేశ సేవలో అమరులైన వీర జవాన్‌లకు వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఘన నివాళులు అర్పించారు. దేశ రక్షణలో భాగంగా ప్రాణాలర్పించిన వీర జవాన్‌లకు నివాళులు అర్పించడం అందరి బాధ్యత అని విద్యార్థి విభాగం నేత నరేష్ అన్నారు. ప్రిన్సిపాల్ స్వరూపా, అధ్యాపకులు మోహన్ రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

దేశ చరిత్రలో దుర్దినం పుల్వామా ఉగ్ర దాడి

కురబలకోట: దేశ చరిత్ర పుటల్లో పుల్వామా ఉగ్రమూకల దాడి చీకటి రోజని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌టీ విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి అన్నారు. పుల్వామా దాడి సంఘటనకు నిరసనగా ఎన్‌సీసీ కేడెట్స్ మంగళవారం బ్లాక్‌డే నిర్వహించారు.

ఎస్వీయూ స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు

మదనపల్లె : పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఎస్వీ యూనివర్సిటీ స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేసిందని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు బాబాఫక్రుద్దీన్, షేక్ ఫారుఖ్‌లు జాతీయస్థాయిలో అమృత్‌సర్ గురునానక్ యూనివర్సిటీ, చత్తీస్‌ఘడ్‌లో జరిగిన తైక్వాండో, కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచారన్నారు. దీంతో ఎస్వీ యూనివర్సిటీ జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నందుకు ఇద్దరికీ రూ.5,000 చొప్పున స్కాలర్‌షిప్ అందజేసిందన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : సంపూర్ణ ఆరోగ్యానికి శారీరక వ్యాయామం తప్పనిసరి అని రేగళ్లు, తలపుల వైద్యాధికారులు డాక్టర్ కార్తీక్‌కుమార్, డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తలపుల, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో (సైక్లాదాన్) సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక శ్రమ లోపించడం వల్ల ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్, ఒత్తిడి, నిద్రలేమి లాంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అలాగే చిన్నవయస్సులోనే గుండెజబ్బులు, గుండెపోటు, కేన్సర్ లాంటి వ్యాధులకు గురైన చిన్నవయస్సులో మృతి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. రోజుకు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు శారీరక, వ్యాయామం చేసి శారీరక బరువును కంట్రోల్‌లో ఉంచుకోవాలని సూచించారు. మోటారు సైకిల్ బదులు, సైకిల్‌ను వాడడంతో ఆరోగ్యం తోపాటు పర్యావరణాన్ని కూడా పరిరక్షించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఈలు కొండయ్య, విజయలక్ష్మీ, సూపర్‌వైజర్లు మోహన్, పవన్‌కుమార్, కుసుమకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగు లాభదాయకం

- సిరికల్చర్ ఏడీ రామ్మోహన్


మాట్లాడుతున్న సిరికల్చర్ ఏడీ రామ్మోహన్

పీలేరు : మల్బరీ సాగు లాభదాయకమని సిరికల్చర్ ఏడీ రామ్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7 వేల మంది రైతులు 9 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. మల్బరీ సాగు రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి రాష్ట్రంలో మదనపల్లె, కుప్పం, హిందూపురం, ధర్మవరం, కదిరి, చెబ్రోలు, హనుమాన్ జంక్షన్, పలమనేరులో ప్రభుత్వ మార్కెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మల్బరీ రైతులు షెడ్డులు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ. 3 లక్షలు రాయితీ ఇస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 11 షెడ్డులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మల్బరీ సాగుకు ఒక ఎకరాకు రూ.18,750 రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. పట్టుగూళ్ల విక్రయాలు రెండేళ్లగా స్థిరంగా ఉన్నట్లు తెలిపారు. ఒక్క కిలో సీబీ రకానికి చెందిన పట్టుగూళ్లు రూ. 500 నుంచి రూ. 650 వరకు ధర పలుకుతున్నట్లు చెప్పారు. బైఓల్టింగ్ రకం కేజీ రూ. 650 నుంచి రూ. 750 పలుకుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతి కేజీకి రూ. 50 చొప్పున ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు చెప్పారు. పట్టుపురుగుల పెంపకానికి అయ్యే మందులకు రూ. 3750 రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ సంజున్ రావు, రఘునాథరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదేషావలి, ఆత్మ అధికారి జ్యోత్స్న, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పీలేరు రూరల్ : చిరుధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్తలు ఐ. జ్యోతి, వై.పీరుసాహెబ్, కోఆర్డినేటర్ డాక్టర్ జి.ఎస్. పాండురంగారావు సూచించారు. మంగళవారం వేపులబైలు పంచాయతీ గ్రామ సచివాలయంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొర్రలు, రాగులు, సజ్జలు, విలువాధారిత ఉత్పత్తులు ఏ విధంగా తయారు చేసుకోవచ్చో అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు రాగి, కొర్రలతో తయారు చేసిన ఉత్పత్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎ. శ్రీనివాసులు, కె. నవీన, గ్రామ సహాయ వ్యవసాయాధికారి మాధురి, పంచాయతీ కార్యదర్శి జ్ఞానశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రాజ్యాధికార చైతన్యయాత్ర వాయిదా

మదనపల్లె : బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న మదనపల్లెలో తలపెట్టిన బహుజన రాజ్యాధికార చైతన్యయాత్ర ముగింపుసభను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. ముగింపుసభకు సంబంధించి తదుపరి తేదీని త్వరలోనే పత్రికాముఖంగా ప్రకటిస్తామని తెలిపారు.